
# మనోజ్ఞ

చంద్ర



ఎవరో పిలిచినట్లయి లేచాడు మనోజ్. ఆశ్చర్యం. తమ మంచానికి ఎదురుగా వున్న కిటికీ తెరిచి వుంది. సంధ్య సాధారణంగా తెరవడానికి వప్పుకోదు. ఎదురింటివాళ్ళు కన్నిస్తారు; పక్కింటి వాళ్ళు చూసేస్తారు అంటుంది.

అయిష్టమైనా ఆమె మాటకాదన్లేకపోయాడు. మరి ఈ రోజు?

ఏదో విశేషమేవుండాలి అనుకొంటూ కిటికి దగ్గరకి వచ్చాడు.

అంతటా నులివెచ్చదనంపరుచుకొని వుంది. రాత్రి కోయకుండా వదిలేసిన చమేలి వింత వాసనలు వెలువరిస్తోంది. కడిగిన గచ్చు మీద బోర్లాపడిన పారిజాతాలు.

మనోహరమైన దృశ్యం. మధురమైన భావన.

రోజూ వీటన్నిటినీ గమనించకపోవడం – ఓహ్!

ముంజేతి మీద సున్నితంగా తట్టినట్లనిపించి వెనుదిరిగాడు మనోజ్. సంధ్య.

ఈ రోజెందుకో సంధ్య చాలా అందంగా అనిపించింది. ఆ మాటే అన్నాడు.

కాఫీ కప్పు చేతిలో పెట్టి, "అవున్లెండి, దృష్టి రమ్యంగా వుంటే సృష్టి రమ్యంగా వుంటుంది. త్వరగా తలస్నానం చేసి తయారవ్వండి." అంది టవల్ తీసుకురావడానికి వెళ్తూ.

కిటికీ మూయనందుకు సంతోషిస్తూ గబగబ కాఫీ పని పూర్తిచేసి బాత్‌రూంలోకి వెళ్ళాడు. ఏం విశేషమై వుంటుందా అని ఆలోచిస్తూ.

మనోజ్ వచ్చేసరికి రూం అంతా సర్దేసి కిటికి మూసేసి వుంచింది సంధ్య. అగరొత్తుల వాసన వస్తోంది లైట్‌గా. మంచం మీద ఏదో కవర్ వుంది పింక్ సాటిన్ రిబ్బన్ చుట్టి.

తల తుడుచుకుంటూ రిబ్బన్ విప్పాడు. గ్రీటింగ్ కార్డ్.

రెండు ముద్దొచ్చే పిల్లులు – ఓ కుచ్చు శాలువాలో తలలు దగ్గరికి పెట్టి కూర్చున్నాయి. పైనిలా వుంది –

ఇట్స్‌లవ్. ప్యూర్ అండ్ సింపుల్.

పేజీ తిప్పాడు.

హమ్‌మ్... విచ్ వన్ ఆఫ్ అజ్ ఈజ్ ప్యూర్ అండ్ విచ్ వన్ సింపుల్?" ... సంధ్య.

నవ్వుకొంటూ పక్కనపెట్టి పాకెట్‌లోని కొత్త డ్రస్ తీసుకొన్నాడు.

ఈ రోజు ప్రత్యేకత ఏమిటో ఇంకా బుర్రకి తట్టలేదు. సంధ్య గబగబా వచ్చింది.

"మీరింకా రెడీ అవలేదూ? త్వరగా కానీయండి," చీర సవరించుకొంటూ అంది.

"పెళ్ళిచీర. అంటే ఈరోజు మా పెళ్ళిరోజు," మనోజ్ అనుకొన్నాడు మనసులోనే, పైకి అరవబోయి తమాయించుకొని.

కంగారు కప్పిపుచ్చడానికి అడిగాడు, "ఎక్కడికండీ మన ప్రయాణం?" చేతిని సంధ్య భుజంపై వేస్తూ.

"నేనెక్కడికి తీసుకువెళితే అక్కడికే," అంది సంధ్య చేతిని మెల్లిగా తీసేసి కారు తాళాలందిస్తూ.

"ఏం నాతో రారూ!" అంది గోముగా.

అంత ప్రేమగా అడిగితే రాననే మూర్ఖుడెవరు? వెంటనే చేతిలో చేయివేసి అన్నాడు.

"చలో దిల్‌దార్ చలో – చాంద్ కీ పార్ చలో"

"హం భీ తయ్యార్ చలో"– సంధ్య గొంతు కలిపింది హుషారుగా.

• • •

పుట్టినరోజు, పెళ్ళిరోజు అంటూ సెలబ్రేట్ చేసుకోవడం తనమటుకు తనకిష్టం వుండదు. నలుగురూ ఒకచోట కలవడానికి ఇంతకంటే సందర్భాలు ఏముంటాయని సంధ్య వాదన. స్నేహితులంతా కలవడానికి ఏదో ఓ ఆదివారం సరిపోదూ! ఆ మాటే సంధ్యతో చెప్పి ఒప్పించాలి ఎలాగైనా అనుకున్నాడు మనోజ్.

సంధ్య చెప్పినట్లుగా కారుని పోనిస్తున్నాడు.

"ఏవండేవండి! ఆ పక్కన చెట్టుకింద ఆపండి" సంధ్య అరుపుతో తేరుకుని కారు అక్కడ ఆపాడు.

సంధ్య గభాల్న కారు దిగి, "త్వరగా నాతో వచ్చేయండి," అంటూ గబగబ వెళ్ళింది.

మనోజ్ తలెత్తి చూసాడు, సంధ్య వెళుతున్న వైపుగా.

అది రంగనాథస్వామి దేవాలయము.

ఒక్కసారిగా కోపం ముంచు కొచ్చింది మనోజ్‌కి.

మతతత్వానికి, దైవార్చనకి తాను వ్యతిరేకినని తెలిసి సంధ్య తననిక్కడికి తీసుకురావడంతో సహజంగానే ఒళ్ళు మండిపోయింది.

విగ్రహారాధనకు విరోధి అయినా విగ్రహాలను పగలకొట్టమనే వాడు కాడు తాను. కరుకు రాళ్ళలో లాలిత్యం నింపి, జీవంపోసే శిల్ప కళను ఎప్పుడూ ఆరాధిస్తాడు, అభిమానిస్తాడు. ఆ కళాకారులకు జోహరులర్పిస్తాడు.

కానీ యుగయుగాల అజ్ఞానానికి, సంకుచిత్వానికి, మతమౌఢ్యానికి ప్రతీకయైన విగ్రహ పూజను నిరసిస్తాడు.

మనసా, వాచా, కర్మణా.

మూడేళ్ళ వైవాహిక జీవితం తరువాత సంధ్య ఈ విధంగా తనకిష్టంలేని పని చేయించడానికి పూనుకోవడం కష్టం కలిగించినా, ఇష్టం లేనపుడు రాకుండా వుండాలి, వచ్చినపుడు సగంలో వెనుదిరుగకూడదనుకొని మెల్లగా కారు దిగి వెళ్ళాడు.

ఉదయకిరణాలు నాట్యమాడుతున్న పెన్నా చిరుకెరటాన్ని చూస్తూ నిల్చున్నాడు మనోజ్.

" అయ్యో, మీరిక్కడ వున్నారా? మీ కోసం అంతా వెదకి వస్తున్నాను. పదండి వెళదాం." అంది సంధ్య అతని వైపు చూడకుండానే.

సంధ్య చేతిలోని పూజా సామాగ్రిని ఓసారి చూసి, ఆమెననుసరించాడు మనోజ్ – మౌనంగా.

భక్తి పారవశ్యమో లేక మనోజ్‌ని గుడికి తీసుకురాగలిగానన్న విజయోత్సాహమో కానీ సంధ్య మొహం వెలిపోతూవుంది.

గుడిగోపురాన్ని పరీక్షిస్తూ, ప్రదక్షిణాలు చేస్తున్న సంధ్యని గమనిస్తున్నాడు మనోజ్.

గుళ్ళో పూజారిచేసే తతంగం అంతా పూర్తయ్యేదాక సంధ్య మొహంలో భావాలు చదవడానికి ప్రయత్నించాడు.

అర్చకుడు కొట్టిన ఘంటారావంతో పూజా కార్యక్రమాలు ముగిసాయని వెనుదిరిగాడు మనోజ్.

ఓ పది నిమిషాల తరువాత సంధ్య బయటికి

వచ్చింది.

వచ్చీరాగానే అక్కడ బారులు తీర్చికూర్చున్న బికారులు ఒక్కసారిగా గొంతెత్తారు – "నీకు పుణ్యముంటుంది తల్లీ, కొడుకు నెత్తుకుంటావు మహాలక్ష్మీ" అంటూ.

వాళ్ళు ఓ ఇరవై ముప్పైమంది దాకా వుంటారు.

సంధ్య అందరికీ డబ్బులిస్తోంది ఓపిగ్గా ఒకరి తరువాత ఒకరికి.

వాళ్ళలో వాళ్ళు తన్నుకోవడం, అరచుకోవడం కొనసాగుతూనే వున్నాయి దాదాపు అరగంట దాకా.

ఉదయం ఎనిమిదిన్నరకే నెల్లూరి సూర్యుడు ప్రతాపం చూపుతున్నాడు.

అందర్నీ సమాధానపరిచి సంధ్య వచ్చింది చెమట్లుకక్కుతూ.

ఆమె రావడం చూసి కారు స్టార్ట్ చేసి వుంచాడు మనోజ్.

సంధ్య కారు ఎక్కగానే అడిగాడు.

"ఏం పుణ్యం కొనుక్కొస్తున్నావా? నీకొక్క దానికేనా? నాక్కూడానా?" నవ్వుతూనే.

సంధ్య కోపంగా తలతిప్పి అడిగింది, "మీరు మనుషులేనా? మీలో మానవత్వం లేదూ? ఆ అవిటివాళ్ళు మిమ్మల్నేం చేసారండీ అలా విరుచుకుపడుతున్నారు? ఆ కూటికి గతిలేని వాళ్ళకి నాలుగు డబ్బులిస్తే మన ఆస్తులేం కరిగిపోవులెండి. ఓ పూట వాళ్ళకి భోజనమైనా వస్తుంది. అయినా, ఆ నిర్భాగ్యుల్ని చూస్తే మీకు జాలేయడం లేదూ? మీది కరుకు మనసు. ఇంకా చెప్పాలంటే ఎదుటివారి బాధలకు స్పందించే హృదయం మీకు లేదు. మీ స్వార్థం నెరవేరితే చాలు. ఏ పండుగకో, పబ్బానికో ఓ రూపాయి దానం చేస్తే నష్టమేమిటట? తల్లీ తండ్రీలేని ఆ అమాయకపు పసివాళ్ళు అలా గొంతెత్తి అరుస్తుంటే మీ మనసు కరగడం లేదూ?"

ఆ పైన కోపంతో గొంతు పూడుకుపోయింది. అటువైపు ట్రాఫిక్‌ను చూస్తూ కూర్చుంది.

సంధ్య మాట్లాడుతున్నంత సేపూ ఆమె హావభావాలు గమనిస్తూ వున్నాడు మనోజ్.

చెమటకు అలుక్కుపోయిన ముంగురులు. నుదుటి మీది రంగురంగుల బొట్టు తడిసి ముక్కు మీదికి కారుతూ వుంటే, ముక్కుపుటాలెగరేస్తూ కొత్తరూపంలో సంధ్య.

అగ్నికి ఆజ్యం తోడుచేయదలుచుకోలేదు మనోజ్. అంటే ఆమె వాదనకి తల ఒగ్గాడని కాదు. సమయం చూసి సమాధానపరచాలని.

• • •

ఈ సంఘటన తరువాత సంధ్య వాదోప వాదాలకు దిగదల్చుకోలేదు. మనోజ్ మౌనం అతని ప్రవర్తనకన్నా ఎక్కువగా బాధించింది. అతను ఎంత సామాన్యంగా ప్రవర్తిస్తున్నా సంధ్య సరిపెట్టుకోలేకపోతోంది.

అందుకే మనోజ్ తయారయిరమ్మనగానే ఎక్కడికని అడక్కుండా బయలుదేరింది.

పట్టణశివార్లు దాటినా ఎక్కడికని అడగ దల్చుకోలేదు. మనోజ్ చెప్పలేదు. కారు పెద్ద కొయ్యగేటులోకి వెళ్ళేపుడు ఓ బోర్డు చూసింది.

మనోతేజ.

కారు ఆగగానే ఓ పదిమంది పరిగెట్టుకొంటూ వచ్చారు, 'మనోజ్ అన్నయ్య' వచ్చాడంటూ. సంధ్యని చూసి వెనకడుగువేసారు.

"పరవాలేదు రండి," అంటూ వారి దగ్గరకి వెళ్ళాడు, "నువ్వూ రా, సంధ్యా," ఆమె వైపు తిరిగి నవ్వుతూ పిలిచాడు.

వారందరినీ పేరుపేరునా పరామర్శిస్తూ ముందుకు నడుస్తున్నాడు మనోజ్. సంధ్య వారినే గమనిస్తోంది. ఒకరికి చేయి లేకపోతే మరొకరికి కాలులేదు. వారందరూ వికలాంగులు. అందరి లోనూ ఓ సామ్యం కనిపించింది.

ఉప్పొంగే ఉత్సాహం.

ఆఫీస్ రూంలోకి వెళ్ళారు. మేనేజర్ లేచి ఎదురువచ్చి పలకరించాడు.

మనోజ్ అక్కడ కూర్చుంటూ అన్నాడు, "సంధ్యా, నువ్వు వర్క్‌షాప్ చూసి రాకూడదూ!"

మనోజ్ మాట నోట్లో వుండగానే ఓ అరడజను మంది సంధ్య దగ్గరకి వచ్చారు, "మేం చూపిస్తాం రండి" అంటూ.

ఓ క్షణం బిడియపడ్డా, వాళ్ళ అభిమానం సంధ్య సంకోచాన్ని తరిమేసింది.

ఓ చిన్నతోట. పూలమొక్కలే కాదు కూరగాయలవీ వున్నాయి, ఓ వారగా.

ఓ గులాబీని కత్తిరించి, చక్కగా ఆకుల మధ్య అమర్చి నాటకీయంగా అందించాడో అబ్బాయి.

రాణీలాగా అందుకొంది ఉత్సాహంగా తనూ అతన్ని అనుకరిస్తూ.

నవ్వుల పువ్వులు విరిసాయి తోటలో.

వర్క్‌షాపులో ఓ చోట కుట్టుపని జరుగు తుంది. ఇంకోచోట స్వెటర్స్ అల్లుతున్నారు. మిగిలిన బట్టముక్కలతో కుషన్ కవర్స్ అవీ చేసారు అందంగా. ఇంకా ఇలాంటివి ఎన్నో.

ఓ హాలులోకి తీసుకెళ్ళారు సంధ్యని. వీళ్ళు తయారుచేసే వస్తువుల మోడల్స్ అందంగా అమర్చి వున్నాయక్కడ. చిన్న గ్రంథాలయం కూడా వుంది.

ఆ పక్కరూంలో కొన్ని ఇండోర్‌గేమ్స్ కూడా వున్నాయి. "ఆర్డర్స్ తక్కువగా వున్నపుడు ఇక్కడే కాలక్షేపం చేస్తుంటామ"ని చెప్పారు వాళ్ళు.

లైబ్రరీలో ఓ పక్కగా దాతలపేర్లు రాసి వున్నాయి. మనోజ్‌పేరు ఎక్కువగా వెతుక్కో కుండానే దొరికింది సంధ్యకి. మామగారి పేరునా, అత్తగారిపేరునా విరాళాలిచ్చినట్లుందక్కడ.

చివరగా, ఓ పక్కగా వున్న చిన్న బిల్డింగ్‌కి తీసుకెళ్ళారు.

"బాలహిత"

పచ్చని చెట్లమధ్య చల్లని ప్రదేశం. అనాథ బాలల ఆదరణాలయం.

వికలాంగులే అక్కడి పర్యవేక్షకులు, ఉపాధ్యాయులు. సంఖ్య తక్కువగా వున్నందుకో ఏమో చాలా క్రమశిక్షణగా వున్నారు పిల్లలు. మనోజ్ అప్పటికే అక్కడికి వచ్చాడు.

ఇంతలో రెండు మొండిచేతుల మీద ఏవో పాకెట్లు పట్టుకొచ్చాడో యువకుడు. సంధ్య గభాల్న ఎదురెళ్ళబోయింది.

ఆ యువకుడు నవ్వుతూ అన్నాడు, "జాలి పడకండి మేడమ్."

అతని ఆత్మాభిమానానికి సంధ్య నివ్వెర పోయింది.

మనోజ్ పిల్లల్ని ఒక్కొక్కళ్ళనీ పలకరిస్తు న్నాడు. వారి ఆరోగ్యం గుర్చి, చదువుగుర్చి, అభిరుచులను గుర్చి పరామర్శిస్తున్నాడు.

"ఈసారి మీలో ఎవరు ఫస్ట్ వచ్చారు?" మనోజ్ అడిగాడు.

"నేనే అంకుల్" ఆనందంగా ఓ చిన్న కంఠం.

"ఓకే, ఈసారి మీకు బహుమతులు మీ ఆంటీ ఇస్తారు."

పిల్లలందరూ సంతోషంగా చప్పట్లు చరిచారు సంధ్యకు స్వాగతమిస్తూ.

మనోజ్ చెపుతూ వుంటే విజేతలకి సంధ్య తలా ఓ పాకెట్టు అందించింది. అవన్నీ అక్కడి వర్క్‌షాప్‌లో తయారయినవే. మిగిలిన వారికి తలా ఓ పెన్ ఇచ్చాడు మనోజ్. అపురూపంగా అందుకొన్నారు వాళ్ళందరూ.

"ఈసారి మీరు కూడా బాగా చదవాలి. నేను మళ్ళీ మీ పరీక్షలు అయిన తరువాత వస్తాను. ఈసారి మంచి గిఫ్ట్సు వుంటాయి. ఓ.కే."

"సరే అంకుల్" ముక్తకంఠంతో పిల్లలంతా అరిచారు.

అక్కడి గౌరవాభిమానాలకు సంధ్య ఉక్కిరి బిక్కిరి అవుతోంది. గొంతు పెగలడంలేదు. ఆశ్చర్యంతో. ఆనందంతో.

మాట్లాడకుండా వాళ్ళని గమనిస్తున్న సంధ్య చేతిని తడుతూ అన్నాడు మనోజ్, "ఇక వెళ్దామా?"

సంధ్య తేరుకునేసరికి మనోజ్ కారు స్టార్ట్ చేసేసాడు. ఆనందమైన వీడ్కోలు. వెళ్ళేపుడు బోర్డువైపు చూసింది సంధ్య మరోసారి.

మనోతేజ.

అవును. వారి మొహాలలోని తేజస్సు వారి మనస్సుది. వారి ఆత్మ విశ్వాసానిది. శారీరక లోపాలు వారి మనోబలం ముందు తల వంచాయి.

ఆలయం దగ్గర తనన్న మాటలు సంధ్యకి గుర్తొచ్చాయి. మౌనంగా తలదించుకుంది.

శారీరక లోపాల్ని నెపంగా పెట్టుకొని, స్వర్గ సుఖాలను ఎరవేస్తూ, పుణ్యకార్యమని మభ్య పెడుతూ జీవితం గడిపే బద్ధకదామోదర్లు వాళ్ళు. పుణ్యానికి కౌంటర్లు తెరిచిన వాళ్ళు, ఎరిగినది ఆత్మద్రోహమే కానీ ఆత్మవిశ్వాసం కాదు. వారిది స్వార్థ ప్రయోజనం.

సమాజ తిరోగమనానికి సారథులైన వారిని పోషించడం, ప్రోత్సహించడం మానవత్వంకాదు మూర్ఖత్వం.

సంధ్యకి మాత్రం యిప్పుడు ఆవేశం ఆలోచనగా మారింది. ఆమె వివేకానికి విచక్షణ తోడయింది. *